క్లుప్తంగా

ముగిసిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. రసాయనశాస్త్రం, కామర్స్ సబ్జెక్టులకు సంబంధించి పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో కలిపి 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

తిరువూరులో..

తిరువూరు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 203 మందిని కేటాయించగా, 189 మంది హాజరయ్యారు. నాగార్జున కళాశాలలో 255 మంది విద్యార్థులకు గాను 245 మంది, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 360 మంది విద్యార్థులకు 346 మంది హాజరైనట్లు ఆయా కళాశాలల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు.

రైతుల సంక్షేమం కోసమే పథకాలు



మైలవరం: రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏఓ కార్యాలయాల భవన నిర్మాణ సముదాయాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగమణి, ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, ఏఓలు సంధ్యారాణి, శైలజ, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల వీడ్కోల సభ

నూజివీడు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవి అందరూ ఉత్తీర్ణులై హైస్కూల్‌కు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. మండలంలోని గొల్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఫేర్‌వెల్ పార్టీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు. 90మార్కులు పైన సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు ఇస్తామని హిందీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు దుర్గామల్లేశ్వరి, కె.వెంకటముత్యం ప్రకటించారు. గణితం ఉపాధ్యాయిని కోటేశ్వరమ్మ మాట్లాడుతూ 90 మార్కులు దాటిన వారికి వెయ్యి రూపాయలు, 100 మార్కులు సాధించిన వారికి రూ.2 వేలు, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన వారికి రూ.5వేలు చొప్పున ఇస్తానని ప్రకటించారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత

నూజివీడు: మీర్జాపురంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం సర్పంచ్ గోళ్ల పద్మ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డీవీఎల్ పుష్పలత, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నరసింహారావు, వెంకటేశ్వరరావు, శివశంకర్, మేకల సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

చాట్రాయి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగమణి తెలిపారు. ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమం సందర్భంగా బుధవారం చాట్రాయి సెంటర్లో కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాలమ్మ, నాయకులు సత్యనారాయణ, కేవీపీఎస్ మండల కార్యదర్శి ఆనందం హోలీ మేరీ, కె.భాస్కరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

నూజివీడు: సుంకొల్లులో ఏడు రోజులుగా స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం బుధవారంతో ముగిసింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో పారిశుద్ధ్యం నిర్వహణ, విద్య ప్రాధాన్యం, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, వైద్యశిబిరం నిర్వహణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు గ్రామంలో ర్యాలీలు చేసి ప్రజలను చైతన్యం చేశారు. ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రోటీన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన ఉండాలి

మైలవరం: ప్రోటీన్ సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఏడీఏక్యూ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎస్.ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీ) డిజైన్‌లో మూడు రోజులు జరిగిన వర్క్‌షాపు బుధవారం ముగిసింది. వర్క్‌షాపులో విద్యార్థులకు ప్రోటీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా తమ ప్రాజక్టులలో సర్క్యూట్ డిజైన్ ఎలా రూపొందించవచ్చో వివరించారు. ఈసీఈ విభాగాధిపతి అమర్‌బాబు మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని విభాగపు విద్యార్థులకు వివిధ రకాల సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ జీఎల్ఎస్ మూర్తి, సీహెచ్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి పక్కా ఏర్పాట్లు

చాట్రాయి: చనుబండ కోదండ రామాలయంలో గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. కల్యాణం నిర్వహించే కల్యాణ మండపం వద్ద టెంట్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఈ ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉండడంతో చుట్టు పక్కల మండలాలతో పాటు ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని గ్రామాల ప్రజలు కల్యాణానికి వేలాది మందిగా తరలి రానున్నారు. బుధవారం రాత్రి వధూవరుల అన్వేషణ (ఎదురుకోలు)ని ఘనంగా నిర్వహించారు



నవమి వేడుకలకు ముస్తాబైన ఆగిరిపల్లిలోని కోదండ రామాలయం



విద్యుత్ దీపాలంకరణలో చనుబండ రామాలయం



తిరువూరు నాగార్జున కళాశాలలో నవమి వేడుకలు



శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆలయాల ముస్తాబు

ఆగిరిపల్లి : మండలంలో గురువారం జరగనున్న శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈ మేరకు ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని కోదండ రామాలయం, నెక్కలం అడ్డ రోడ్డు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద, శోభనాపురం, తోటపల్లి గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చిన్న ఆగిరిపల్లి సీతారామాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పొన్నం లక్ష్మణరావు తెలిపారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక నాగార్జున స్కూల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. నవమి ఉత్సవాల విశిష్టతను పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహారావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని శ్రీకోదండ రామాలయం, పాతతిరువూరు రామాలయం, రాజుపేట, జగన్నాథపురం కాలనీలలోని ఆంజనేయస్వామి ఆలయాలు, షిర్డిసాయి మందిరం, శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయాలలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. భద్రాచలం శ్రీసీతారామకల్యాణానికి తరలివెళ్ళే భక్తుల సౌకర్యార్థం తిరువూరు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సుసర్వీసులు ఏర్పాటు చేసింది.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ఆగిరిపల్లి : మండలంలోని సింహాద్రి అప్పారావుపేటలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఒక రోజు ముందుగానే పాఠశాల హెచ్ఎం మక్కె వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్పరాణి తయారు చేసిన పానకం, వడపప్పును విద్యార్థులకు పంపిణీ చేశారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పుల్లూరు(మైలవరం): చిరు ధాన్యాలతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ పుష్పలత తెలిపారు. ఐసీడీఎస్ మైలవరం ప్రాజక్టు పరిధిలోని పుల్లూరు పంచాయతీలోని 10 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి పోషణ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చిరుధాన్యాలు తీసుకోవడం వలన తల్లులు, బాలింతలు, గర్భిణుల్లో రక్త హీనత, ఇతర రోగాలు నివారించవచ్చన్నారు. పౌష్టికాహారం గురించి సీడీపీఓ పుష్పలత వివరించారు. పుల్లూరు సొసైటీ అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల వైఎస్సార్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. తల్లులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ మైలవరం సూపర్‌వైజర్ గౌసియాభేగం, సాంబిరెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, ఏఎన్ఎంలు, వార్డు సభ్యులు, ఆశా వర్కర్స్, టాటా ట్రస్టు ప్రాజక్టు కో-ఆర్డినేటర్ డీ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ కమల పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించవచ్చని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ నరేంద్రసింగ్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించి చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. సీడీపీఓ ఎస్వై నూరాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు మరణాలను పూర్తిగా నిరోధించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యాధికారి గంగాధరకుమార్, ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి, హెచ్‌వీ ఆర్.మంగాయమ్మ పాల్గొన్నారు.



పుల్లూరులో జరిగిన పోషక్ పక్వాడా కార్యక్రమంలో చిరుధాన్యాల ప్రదర్శన

వైఎస్సార్ జలకళను సద్వినియోగం చేసుకోవాలి



ఆగిరిపల్లి : వైఎస్సార్ జలకళను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు అన్నారు. మండలంలోని కలటూరులో జలకళ బోరు పనులను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశాల మేరకు సర్పంచ్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు.

జలకళ బోర్లు సేద్యానికి జీవ నాడులు

ముసునూరు: వైఎస్సార్ జలకళ బోర్లు సన్న, కారు రైతుల సేద్యానికి జీవ నాడులుగా ఉపకరిస్తాయని సర్పంచ్ రంగు ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రమణక్కపేటలో వైఎస్సార్ జలకళ బోరును బుధవారం ఆమె ప్రారంభించారు. గ్రామంలో తొమ్మిది బోర్లు మంజూరు కాగా తొలి బోరును ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఉపసర్పంచ్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కరంచంద్‌గాంధీ, రామకృష్ణ, సుబ్బారావు, కృష్ణ కిషోర్, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో వీఎక్స్ఎల్ ఐటీ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉపాధి నైపుణ్య శిక్షణా వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ అక్బర్ ఖాన్, వీఎక్స్ఎల్ ఐటీ అకాడమీ ప్రతినిధులు ఉపాధి అవకాశాలకు కావల్సిన మెలకువలు వివరించారు. ఈసందర్భంగా నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రోగ్రాం కన్వీనర్ జి.మిన్నీ, కో-ఆర్డినేటర్ సయ్యద్ సాదత్ ఆలీ పాల్గొన్నారు.

టీడీపీ దాడులు హేయం

తిరువూరు: గంపలగూడెం మండలం కనుమూరులో వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడటం హేయమని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఖండించారు. కనుమూరులో మంగళవారం టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి తిరువూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కనుమూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చెరుకు భాస్కరరెడ్డి తదితరులను బుధవారం ఎమ్మెల్యే పరామర్శించారు. అకారణంగా గ్రామంలో అలజడి సృష్టిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం, ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడటం టీడీపీ కార్యకర్తలకు అలవాటుగా మారిందని రక్షణనిధి విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న తిరువూరు నియోజకవర్గంలో ఇటువంటి చర్యలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమని, పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తిరువూరు, గంపలగూడెం మండలాల వైఎస్సార్సీపీ నాయకులు నరసారెడ్డి, వెంకటరెడ్డి, ప్రకాష్‌రెడ్డి ఉన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కుటుంబ ఆర్థిక స్వావలంబన మహిళలతోనే సాధ్యం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కుటుంబ ఆర్థిక స్వావలంబన మహిళలతోనే సాధ్యమని, ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని (పింఛన్ మినహా) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి పేరు మీదే ఇవ్వడం అందుకు నిదర్శనమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మూడో విడత సంబరాలు బుధవారం విజయవాడ రూరల మండలం గొల్లపూడి సాయిపురంకాలనీలోని సచివాలయం-2 ఆవరణలో నిర్వహించారు. తొలుత వైఎస్ ప్రతిమకు పూలమాల వేసి నివాళులర్పించారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని గొల్లపూడి, పైడూరుపాడు, రాయనపాడు, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి గ్రామాల్లోని 698 స్వయం సహాయక సంఘాలలోని 6,863 మంది డ్వాక్రా మహిళలకు రూ. 6,20,52,650 చెక్కును ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులందరూ ప్రజా సేవకులేనన్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భావన అని, అందుకే ప్రతి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అదే సమయంలో ప్రజల సమస్యలనుకూడా అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ సురేష్, సహకార బ్యాంక్ చైర్మన్ వెంకట్రావు, మండల అధ్యక్షుడు బయ్యారపు రవి కిషోర్, రూరల్ తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ బాపతి భార్గవి పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ఆసరా పథకం డ్వాక్రా మహిళలకు ఒక వరం



ఎ.కొండూరులో వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా మహిళలకు ఒక వరం లాంటిందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన వైఎస్సార్ ఆసరా వేడుకల్లో డ్వాక్రా మహిళలకు మంజూరైన రుణమాఫీ చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడు ప్రజా సంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకొని వైఎస్సార్ ఆసరా మూడో విడత రుణమాఫీ మండలంలో 1,094 డ్వాక్రా గ్రూపులకు రూ.10,00,60,156 చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మండలంలో 11,583 మంది మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి వెంటనే మంజూరు చేయించామని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, కాలసాని చెన్నారావు, సర్పంచ్ వెంపాటి రజిని, వైస్ ఎంపీపీలు గుంటక శివారెడ్డి, సిద్దం పద్మ, వెలుగు ఏపీఎం ఆర్ సత్యం, జిల్లా సమైక్య అధ్యక్షురాలు కే సీత, సీసీలు కే కృష్ణకుమారి, ఎస్‌కే బాజీ, ఎమ్మెస్ అధ్యక్షురాలు వి.కస్తూరి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, కోట పుల్లారావు, సతీష్, వెంకట్‌రెడ్డి, టి.సురేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

ఎ.కొండూరు: ప్రతి గ్రామానికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. మండలంలోని కోమటికుంట గ్రామంలో బుధవారం జలజీవన్ మిషన్ ద్వారా రూ. 18.50 లక్షలతో నూతన పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయించి, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రామంలో ఇక నుంచి తాగునీరుకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

తిరువూరు: పట్టణంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులకు బుధవారం జరిగిన నగర పంచాయతీ అత్యవసర సమావేశం ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పశువుల సంత నిర్వహణ టెండరును రూ.26 లక్షల 80వేలకు ఆమోదం తెలిపారు. మూడు సంవత్సరాల పాటు ఈ సంత నిర్వహణకు అనుమతిచ్చినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, ఆరుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకం, నగర పంచాయతీ దుకాణ సముదాయాల లీజు రెన్యువల్, వార్డు సచివాలయకు భవనాలు అద్దెకు ఇచ్చిన యజమానులకు బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై కౌన్సిల్ చర్చించి ఆమోదం తెలిపింది. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో ఎజెండా అంశాలను వివరిస్తున్న కమిషనర్

ఆర్వో ప్లాంట్‌ను వినియోగించుకోవాలి

ఊటుకూరు(గంపలగూడెం): సేవా కార్యక్రమాల్లో భాగంగా కోరమండల్ ఊటూకూరు బ్రాంచి ఆధ్వర్యంలో హైస్కూల్లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగపరచుకోవాలని కోరమండల్ జోనల్ మేనేజర్ సురేష్ పేర్కొన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోరమండల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సీహెచ్ రాజేశ్వరరావు, వ్యవసాయాధికారి బి.సాయిశ్రీ, సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ, షణ్ముఖరావు, ఎస్.సుబ్బారావు, హెచ్ఎం రత్నసునాదం పాల్గొన్నారు.

పార్థీనియం కలుపు మొక్కలు ప్రమాదకరం

చంద్రాల(మైలవరం): పార్థీనియం కలుపు మొక్క(వయ్యారిభామ) ఎంతో ప్రమాదకరమైన మొక్క అని, దీనిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి ఆధ్వర్యంలో పార్థీనియం కలుపు మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. వయ్యారిభామ మొక్కలు ద్వారా శ్వాసకోశ వ్యాధులు, టీబీ, ఉబ్బసం, ఆయాసం వంటి ఎన్నో జబ్బులు చిన్నపిల్లల్లో తలెత్తుతాయన్నారు.

కలుపు మొక్కల నివారణకు స్పెషల్ డ్రైవ్

తిరువూరు: వయ్యారిభామ కలుపు మొక్కల నివారణకు పంచాయతీరాజ్ శాఖ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. గ్రామ సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లో కలుపు మొక్కలను తొలగించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎర్రమాడు, పెద్దవరం, ఆంజనేయపురం, మునుకుళ్ల, మల్లేల, కాకర్ల, లక్ష్మీపురం, కోకిలంపాడు, చింతలపాడు, రోలుపడి గ్రామాల్లో వ్యవసాయ, సచివాలయ సిబ్బంది మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: వయ్యారిభామ కలుపు మొక్కల నివారణ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం చేపట్టినట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. స్థానిక మండలపరిషత్ ఆవరణలో ఎంపీడీఓ వయ్యారిభామ మొక్కలను తొలగించారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, ఎంఈఓ చదలరామకృష్ణ పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలోని అన్ని గ్రామాల్లో వయ్యారిభామ కలుపు మొక్కల సామూహిక తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గంపలగూడెంలో కార్యక్రమాన్ని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ కోట పుల్లమ్మ, వ్యవసాయాధికారి సాయిశ్రీ, ఈఓపీఆర్డీ బాబురావు, ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భవానీపురంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): వయ్యారి భామ కలుపు మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని గొల్లపూడి గ్రామంలోని సాయిపురంకాలనీలో బుధవారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, ఎంపీడీఓ బాపతి భార్గవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ శాంభవి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, సహకార బ్యాంక్ చైర్మన్ వెంకట్రావు, మండలాధ్యక్షుడు బయ్యారపు రవి కిషోర్ పాల్గొన్నారు.

వయ్యారిభామతో పైరుకు నష్టం

జి.కొండూరు: వయ్యారిభామ కలుపు మొక్కలు విస్తరించడం వల్లన పంటలపై ప్రభావం చూపి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఎంపీపీ వేముల కొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. వయ్యారిభామ కలుపు మొక్కల నియంత్రణ చర్యలపై జి.కొండూరులో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ అనురాధ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

విస్సన్నపేట: దోమల నివారణకు పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి తెలిపారు. దోమల నివారణ ద్రావణాన్ని గ్రామంలో అన్ని వీధుల్లో పిచికారీ చేసే కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సహజ పానీయాలతో ఆరోగ్యం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వేసవిలో సహజ పానీయాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని క్రాంతి కాన్వెంట్ కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీ మోహన్ అన్నారు. కూల్ డ్రింక్స్ మానేద్దాం.. సహజపానీయాలు సేవిద్దాం అనే నినాదంతో శ్రీరామనవమిని పురస్కరించుకుని పాఠశాలలో బుధవారం సహజ పానీయాలు పంపిణీ చేశారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

మైలవరం: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో వారం రోజుల స్పెషల్ క్యాంప్ బుధవారం కొనసాగింది. బాలికల సంరక్షణకు అందరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్ మెంటర్ కే.రాణిరుద్రమ, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.శివహరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

పుల్లూరు(మైలవరం): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పైపులైన్ ఏర్పాటు విషయంలో ప్రమాదాలు జరగకుండా అన్ని విధాలుగా జాగ్రతలు తీసుకుంటున్నామని ఐఓసీఎల్ ఇన్‌చార్జి టీ.రవీంద్ర(చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్) తెలిపారు. మైలవరం మండలంలోని రైట్ ఆఫ్ వేలో పుల్లూరులో బుధవారం ఫైర్ మాక్ డ్రిల్-లెవెల్3 నిర్వహించారు. మండల స్టేషన్ ఫైర్ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పుల్లూరు గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరి, మ్యాక్ డ్రిల్‌కు సహకారం అందించినట్లు రవీంద్ర తెలిపారు.

బయోమెట్రిక్ హాజరుపై పరిశీలన చేయాలి

ఇబ్రహీంపట్నం: ఏపీ జెన్‌కో సంస్థ థర్మల్ విద్యుత్ ప్లాంట్లులో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రవేశపెట్టనున్న నూతన బయోమెట్రిక్ విధానంపై అధికారులు మరోసారి పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ అశోక్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పాఠశాలల్లో రికార్డుల తనిఖీ

గంపలగూడెం: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని మండల విద్యాశాఖాధికారి బి.సోమశేఖర్‌నాయక్ తెలిపారు. గంపలగూడెం మెయిన్ ఎలిమెంటరీ పాఠశాల, సత్యాలపాడు ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టీలను, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు.ఎలాంటి లోటుపాట్లు లేకుండా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మిక, కర్షక వర్గాలు తరలివచ్చి విజయంతం చేయాలని సీఐటీయూ జిల్లా సంయుక్త కార్యదర్శి జి.రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ నాయకులు నాగమణి, ఆర్ఎస్ నారాయణ, సీఐటీయూ పట్టణ అధ్యక్షులు ఎన్ఆర్ హనుమాన్లు, కమల, నాగమణి, రాజేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

తిరువూరు: సకాలంలో పన్నులు చెల్లించి, తిరువూరు పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ కోరారు. ఈ నెల 31వ తేదీలోపు చెల్లించి బకాయిల వసూలుకు ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. నగరపంచాయతీ కార్యాలయంలో లేదా మీసేవ కేంద్రాల్లో పన్నుల చెల్లింపునకు అవకాశం ఉందని తెలిపారు.

వీల్‌చైర్ అందజేత

విస్సన్నపేట: స్థానిక రాజీవ్‌కాలనీకి చెందిన దివ్యాంగురాలికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీల్‌చైర్‌ను బుధవారం అందజేశారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి చేతుల మీదుగా దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేశారు.

ప్రకటన

[illegible]